

నెంబర్‌ప్లేట్ టాంపరింగ్ వాహనాల పట్టివేత



పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలు

కరీంనగర్ క్రైం, జనవరి 30: కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు మంగళవారం నగరంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి నెంబర్‌ప్లేట్ టాంపరింగ్, నెంబర్ ప్లేట్ లేని 75 ద్విచక్ర వాహనాలను పట్టుకున్నారు. కరీంనగర్ ట్రాఫిక్ ఏసీపీ ఎండీ సర్వర్ ఆధ్వర్యంలో నగరంలోని పలు చోట్ల స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పట్టుకున్న ద్విచక్రవాహనాలను ట్రాఫిక్ ఠాణాకు తరలించారు. నెంబర్‌ప్లేట్ బిగించుకున్న వాహనాలను వదిలిపెట్టారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ప్రజల భద్రత దృష్ట్యా తీసుకునే చర్యలకు ప్రజలు సహకరించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి నెంబర్‌ప్లేట్ లేకుండా ద్విచక్రవాహనాలను నడపరాదని అన్నారు. స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందని, పట్టుబడిన వాహనదారులకు ఈ చలాన్ ద్వారా జరిమానా విధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ పర్స రమేష్, ఎస్‌ఐలు రాజు, సాగర్, శ్రీకాంత్‌లతోపాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిబ్రవరి 2న సదరం స్లాట్ బుక్ చేసుకోవాలి

సుభాష్‌నగర్, జనవరి 30: జిల్లా ఆసుపత్రిలో ఫిబ్రవరి, మార్చి నెలలో నిర్వహించే సదరం శిబిరానికి సంబంధించిన స్లాట్‌ను ఫిబ్రవరి 2న ఉదయం 11.30 గంటలకు బుక్ చేసుకోవాలని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి తెలిపారు. ఫిబ్రవరి 6న ఆర్థో, 13 మానసిక రోగులు, 20న కంటిచూపు, 26న వినికిడి(చెవుడు), మూగ అలాగే మార్చి నెలలో 4న ఆర్థో, 12న మానసిక రోగులు, 19న కంటిచూపు, 26న వినికిడి(చెవుడు),మూగ శిబిరాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. నిర్ధారించిన తేదీలలో సదరం శిబిరానికి వచ్చేవారు సంబంధిత వైద్య పత్రాలు, మీసేవలో బుక్‌చేసుకున్న కేసీదుతో పాటు పాస్‌పోర్టు సైజ్, ఆధార్ కార్డ్ జిరాక్స్ తీసుకొని సదరం క్యాంపునకు హాజరు కావాలని తెలిపారు.

- హైదరాబాద్‌లో సమావేశమైన ఎన్నికల కమిటీ
- కరీంనగర్ స్థానానికి నలుగురి పేర్లు సిఫారసు
- జాబితాలో జీవన్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, రుద్ర సంతోష్, నేరెళ్ల శారద

ఎంపీ అభ్యర్థులపై కాంగ్రెస్ కసరత్తు



(ఆంధ్రజ్యోతిప్రతినిధి, కరీంనగర్)

పార్లమెంట్ ఎన్నికల్లో పోటీకి నిలిపే అభ్యర్థుల ఎంపిక కోసం కాంగ్రెస్ పార్టీ నాయకత్వం కసరత్తు ప్రారంభించింది. కరీంనగర్ పార్లమెంట్ స్థానంలో పోటీ చేసేందుకు నలుగురి పేర్లను ఆ పార్టీ నాయకత్వం పరిశీలిస్తున్నది. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన కాంగ్రెస్ ప్రదేశ్ ఎన్నికల కమిటీ సమావేశం కరీంనగర్ స్థానానికి మాజీ శాసనసభ్యుడు అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, మాజీ శాసనసభ్యుడు, ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి, ఆలిండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రుద్ర సంతోష్‌కుమార్, మహిళా కాంగ్రెస్ మాజీ రాష్ట్ర అధ్యక్షురాలు నేరెళ్ల శారద పేర్లను ఏఐసీసీ పరిశీలనకు పంపించింది. గతంలో ఈ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన పొన్నం ప్రభాకర్ ప్రస్తుతం హుస్నాబాద్ శాసనసభ్యుడిగా ఎన్నికై రాష్ట్ర మంత్రివర్గంలో ఉన్నారు. దీనితో ఈ స్థానానికి కొత్త అభ్యర్థి ఎంపిక అవసరమైంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి హుస్నాబాద్ టికెట్‌ను ఆశించారు. అయితే ఆ స్థానంలో పార్టీ అధిష్టానవర్గం పొన్నం ప్రభాకర్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది. అదే సమయంలో ప్రవీణ్‌రెడ్డిని పార్లమెంట్ ఎన్నికల్లో పోటీచేసే అవకాశం కల్పిస్తామని లేదా మరేదైనా కీలకపదవిని అప్పగిస్తామని హామీ ఇచ్చినట్లు పార్టీవర్గాల్లో ప్రచారం జరిగింది. ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి గతంలో కరీంనగర్ పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేశారు. ఆయనకు ఈ నియోజకవర్గంలో విస్తృత సంబంధాలు ఉన్నాయి. ఆయన స్వంత నియోజకవర్గమైన జగిత్యాల నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఉండగా ఆ పక్కనే ఉన్న కోరుట్ల నియోజకవర్గం కూడా ఈ జిల్లాకే చెందింది కావడంతో జీవన్‌రెడ్డికి ఆ రెండు నియోజకవర్గాల్లోనూ పట్టు ఉన్నది. దీనితో ఆయన పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్, నిజామాబాద్ నియోజకవర్గాల్లో ఎక్కడ అవకాశం కల్పించినా పోటీచేసేందుకు సిద్ధంగా ఉన్నానని పార్టీ నాయకత్వానికి తెలిపారని సమాచారం. జిల్లాలోని గంగాధర మండలం ఆచంపల్లి గ్రామానికి చెందిన రుద్ర సంతోష్‌కుమార్ ఆలిండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్రశాఖ ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన తెలంగాణ ఇన్‌చార్జిగా ఎన్నికల వార్ రూమ్‌లో కీలకపాత్ర వహించారు. 31 నియోజకవర్గాల బాధ్యతను ఆయనకు అప్పగించగా అందులో 23 స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచారు. ఆయా అభ్యర్థుల స్థితిగతులు, బలాబలాలు, వివిధ ప్రాంతాల్లో అభ్యర్థులకు నష్టం చేస్తున్న అంశాలను గుర్తించి ఎప్పటికప్పుడు సూచనలు ఇస్తూ వాటిని అధిగమించేందుకు తోడ్పడడం ఈ వార్ రూమ్ పనికాగా రుద్ర సంతోష్‌కుమార్ ఆ బాధ్యతను సమర్థవం తంగా నిర్వహించారని పేరు సంపాదించుకున్నారు. 2019 ఎన్నికల్లో వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జిగా కూడా పనిచేశారు. రాహుల్‌గాంధీతోపాటు భారత్ జోడో యాత్రలో పాల్గొన్న రుద్ర సంతోష్ పార్టీ అధిష్టానవర్గం వద్ద పట్టు









సంపాదించుకున్నారు. మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలుగా పనిచేసిన నేరెళ్ల శారద కరీంనగర్ పార్లమెంట్ స్థానాన్ని ఆశిస్తుండగా అధిష్టానవర్గం కూడా అందుకు సానుకూలంగా స్పందించింది. ప్రదేశ్ ఎన్నికల కమిటీ ఈ నాలుగు పేర్లను కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీకి సిఫారసు చేయడం ప్రాధాన్యతను సంతరించుకున్నది. ఈ నలుగురిలో అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, జీవన్‌రెడ్డి పేర్లు తొలి నుంచి వినిపిస్తున్నవే. వీరితోపాటు మాజీ ఎమ్మెల్సీ టి.సంతోష్‌కుమార్, వెలిచాల రాజేందర్‌రావు పేర్లు అటు జిల్లాలో రాష్ట్రస్థాయిలో చర్చల తెరపైకి వచ్చాయి. టి. సంతోష్‌కుమార్ పేరు కరీంనగర్ అసెంబ్లీ స్థానానికి పరిశీలించి ప్రకటించే తుది సమయంలో పురమల్ల శ్రీనివాస్‌ను ఖరారు చేశారని ఆ సందర్భంలోనే సంతోష్‌కుమార్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో పోటీచేసే అవకాశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు ప్రచారం జరిగింది. వెలిచాల రాజేందర్‌రావు కుటుంబం తొలుత కాంగ్రెస్ పార్టీకి చెందిందే అయినా తర్వాత క్రమంలో ఆయన టీఆర్ఎస్, ప్రజారాజ్యం పార్టీల్లో చేరి కీలకపాత్ర వహించారు. ప్రజారాజ్యం పార్టీ అభ్యర్థిగా 2009 ఎన్నికల్లో కరీంనగర్ పార్లమెంట్ స్థానానికి పోటీపడ్డారు. ఆ తర్వాత టీఆర్ఎస్‌లో చేరారు. చాలా సంవత్సరాలుగా ఆయన టీఆర్ఎస్ క్రియాశీలరాజకీయాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో కాంగ్రెస్ అభ్యర్థులందరికి తన తోడ్పాటునందించి విజయం కోసం కృషిచేశారని, పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొనే ఆయన అసెంబ్లీ ఎన్నికల నుంచే ప్రయత్నాలు ప్రారంభించారని చర్చజరిగింది. రాజేందర్‌రావు పేరు ఖరారు చేసే విషయంలో జిల్లా నుంచి గెలుపొందిన శాసనసభ్యు లందరూ మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా సుముఖంగా ఉన్నారని పార్టీవర్గాలు చర్చించుకున్నాయి. అయితే ఇప్పుడు ప్రదేశ్ ఎన్నికల కమిటీ సిఫారసు చేసిన పేర్లలో రాజేందర్‌రావు పేరుగానీ, టి.సంతోష్‌కుమార్ పేరుగానీ లేకుండా పోయాయి. అంతేకాకుండా ఎన్నారైలుగా ఉన్న జిల్లాకు చెందిన ఇద్దరు యువ మహిళా నాయకురాళ్లు కూడా కరీంనగర్ పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థులుగా పోటీచేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారని పార్టీవర్గాల్లో పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. పొల్సాని స్నేహ, సింగిరెడ్డి సుమనరెడ్డి అవకాశం కల్పిస్తే పోటీ చేస్తామని రాష్ట్ర నాయకత్వం ముందు తమ ప్రతిపాదనలు పెట్టారని సమాచారం. అయితే వీరిద్దరి పేర్లు కూడా ప్రస్తుతం సిఫారసు చేసిన జాబితాలో లేవు. ప్రదేశ్ ఎన్నికల కమిటీ సిఫారసు చేసిన పేర్ల నుండే కాకుండా కేంద్ర ఎన్నికల కమిటీ, ఏఐసీసీ కూడా వారిస్థాయిలో ఇతర పేర్లను కూడా పరిశీలించే అవకాశం ఉన్నది. దీనితో ఇక్కడ నుంచి సిఫారసు చేసిన పేర్లలో ఒకరికిగానీ, వేరేవారికిగానీ టికెట్ లభించే అవకాశం లేకపోలేదని పార్టీవర్గాలు చర్చించుకుంటున్నాయి.

ముగియనున్న గడువు

- ఫిబ్రవరి 1తో సర్పంచ్‌ల పదవీకాలం పూర్తి
- ప్రత్యేక పాలనకు రంగం సిద్ధం

హుజూరాబాద్, జనవరి 30: గ్రామపంచాయతీల సర్పంచ్‌ల పదవీ కాలం ఫిబ్రవరి 1తో ముగియనుంది. ఇక మిగిలింది ఒక్కరోజు మాత్రమే. 2వ తేదీ నుంచి ప్రత్యేక పాలన కొనసాగనుంది. ఇందు కోసం శాఖల వారీగా అధికారుల కేటాయింపు, ఏర్పాట్లు, వివరాలను జిల్లా పంచాయతీ అధికారులు ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించారు. గ్రామపంచాయతీ పాలకవర్గ పదవీ కాలం ముగిసిన తర్వాత సకాలంలో ఎన్నికలు నిర్వహించాలంటే నెల రోజుల ముందు నుంచే ఆ ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుంది. ఇక ఒకరోజు మాత్రమే గడువు ఉండడంతో ప్రత్యేక పాలన వైపే రాష్ట్ర ప్రభుత్వం మొగ్గు చూపుతుంది. తమకే తిరి గి పర్సన్ ఇన్‌చార్జీలుగా అవకాశం ఇవ్వాలని సర్పంచ్‌లు మంత్రులకు వినతిపత్రాలు సమర్పిస్తున్నారు. ప్రభుత్వం మాత్రం ఆ వైపుగా ప్రయత్నించడం లేదు. అన్ని గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించేందుకు గత 10రోజులుగా శాఖల వారీగా ఉద్యోగుల వివరాలను సేకరించారు. జిల్లా, మండల, గ్రామ స్థాయిలో వివిధ భాగాల్లో పనిచేస్తున్న గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఉద్యోగుల ఆధారంగా ప్రత్యేకాధికారులుగా జాబితా రూపొందిస్తు న్నారు. మేజర్ గ్రామపంచాయతీలకు తహసీల్దార్, ఎంపీడీవో, ఎంపీవో, జూనియర్ అసిస్టెంట్లు, చిన్న గ్రామ పంచాయతీలకు నాన్ గెజిటెడ్ పంచాయతీరాజ్ ఏఈ, ఇరిగేషన్, అగ్రికల్చర్ ఏఈవోలు, మిషన్ భగీరథ, ఆర్ అండ్ బీ, ఐసీడీఎస్, డీఆర్‌డీఏ, పశుసంవర్ధక శాఖ, విద్యాశాఖ అధికారులను స్పెషలాఫీసర్లుగా నియమించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. వీరందరూ గ్రామాల్లో మంచినీటి సరఫరా, పైపులైన్ల లికేజీలు అరికట్టడం, పన్నులు వసూళ్లు చేయడం, పారిశుధ్య నిర్వహణ తదితర కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంటుంది. బుధవారంలోగా ప్రభుత్వం నుంచి గ్రామపంచాయతీ ప్రత్యేక పాలనపై జీవో విడుదల కానుంది.



అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

- ఐసీడీఎస్ అధికారిణికి సమ్మె నోటీసు అందజేత

గణేశ్‌నగర్,జనవరి 30 : ఐసీడీఎస్, అంగన్‌వాడీ ఉద్యోగ వ్యతిరేక విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 16న జరిగే అఖిలభారత సమ్మెలో మంథని ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ అంగన్వాడీ టీచర్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ప్రాజెక్టు కమిటీ పిలుపనిచ్చింది. ఈ సందర్భంగా జిల్లా మంథని ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిణికి సమ్మెనోటీసు మంగళవారం అందజేశారు. ఈ కార్య క్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి వనజారాణి జి జ్యోతి, సహాయ కార్యదర్శి టి కృష్ణ కుమారి నాయకులు బూడిద గణేష్ సందీప్, ప్రాజెక్టు నాయకులు సుగుణ శోభ తదితరులు పాల్గొన్నారు.



ఐసీడీఎస్ అధికారికి సమ్మె నోటీసు అందిస్తున్న అంగన్‌వాడీలు

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న పది సంవత్సరాలలో ఐసిడిఎస్‌కు బడ్జెట్ 60 శాతానికి తగ్గించారన్నారు. దీనివల్ల ఐసిడిఎస్ బలహీన పడిందన్నారు. దీంతో అంగన్వాడీ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు రావడం లేదన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో మౌలిక వసతులు కల్పించడం లేదని తెలిపారు. నాణ్యమైన ఆహారం ప్రజలకు అందడం లేదన్నారు. ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సిఫార్సులను బీజేపీ ప్రభుత్వం తుంగలో తొక్కిందన్నారు. ఐసీడీఎస్ బడ్జెట్ పెంచి అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలన్నారు. సమ్మెలో జిల్లాలోని అంగన్వాడీ ఉద్యోగులందరూ పాల్గొనాలని జిల్లా కమిటీ పిలుపునిస్తోందన్నారు.

విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి



ధర్నా చేస్తున్న విద్యార్థి, యువజన సంఘాల నాయకులు

సుభాష్‌నగర్, జనవరి 30: చింతకుంట గురుకుల పాఠశాలలో ఆదివారం రాత్రి విద్యార్థిని మృతి ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని విద్యార్థి, యువజన సంఘాలు డిమాండ్ చేశాయి. విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని, ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జిల్లా ఆసుపత్రి ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ చింతకుంట గురుకుల పాఠశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న అక్షిత అనే విద్యార్థిని మృతి బాధాకర మన్నారు. ప్రిన్సిపాల్ నిర్లక్ష్యం కారణంగానే విద్యార్థి మృతి చెందిందని ఆరోపించారు. విద్యార్థిని మృతిపై ఆమె తల్లిదండ్రులకు సరైన సమయంలో ఎందుకు సమాచారం ఇవ్వలేదని ప్రశ్నించారు. విద్యార్థిని మృతిని అధికారులు కూడా పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించి మృతిపట్ల సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి మచ్చ రమేశ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జల శ్రీకాంత్, యుఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సంద గణేశ్, పీడీఎస్‌యు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అంగడి కుమార్, జిల్లా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బోనగిరి మహేందర్, బ్రాహ్మణపల్లి యుదేందర్, ఏఐఎస్‌నగర్ కార్యదర్శి మామిడిపెల్లి హేమంత్, కసిరెడ్డి సందీప్‌రెడ్డి, చంచల మురళీ తదితరులు పాల్గొన్నారు.

వరిలో మొగి పురుగును అరికట్టాలి

కరీంనగర్‌రూరల్, జనవరి 30: వరిలో ప్రధాన సమస్య మొగి పురుగు అని శాస్త్రవేత్త డాక్టర్ ఎం రాజేంద్రప్రసాద్ అన్నారు. కరీంనగర్ రూరల్ మండలం నగునూరులో మంగళవారం జిల్లా ఏరువాక కేంద్రం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో క్షేత్ర పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొగిపురుగు లక్షణాలు కనిపించిన వెంటనే నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. వాతా వరణ పరిస్థితుల్లో మార్పు వచ్చినపుడు వరికి మొగి పురుగు ఆశిస్తుందన్నారు. మొగిపురుగు నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. సల్ఫైడ్ దుష్ప్రభావంపై రైతులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త శ్రావణి, వ్యవసాయాధికారి సత్యం, వ్యవసాయ విస్తరణ అధికారి పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

- జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్

కరీంనగర్ టౌన్, జనవరి 30: దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ కొనియాడారు. అమరుల త్యాగాలు భావితరాలకు తెలియజేయడం మన బాధ్యత అని అన్నారు. అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టరేట్ సమావేశ మందిరంలో అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. అమరుల ఆశయాలను ముందుకు తీసుకెళ్తామనే దృఢ సంకల్పంతో వారి ఆత్మశాంతి చేకూరాలని కోరుతూ మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల స్మృత్యర్థం ప్రతి సంవత్సరం జనవరి 30న అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా రెండు నిమిషాలు మౌనం పాటించడం జరుగుతుందని అన్నారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో ఎందరో మహనీయులు తమ ప్రాణాలను పణంగా పెట్టి అమరులుగా నిలిచారని, వారి త్యాగాల ఫలితాలను నేడు మనం అనుభవిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో పవన్‌కుమార్, కలెక్టరేట్ ఏవో సుధాకర్, సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.



అమరవీరులకు నివాళులర్పిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, అధికారులు

కాంగ్రెస్ ఆధ్వర్యంలో జాతిపితకు ఘన నివాళి

కరీంనగర్ అర్బన్ : జాతిపిత మహాత్మాగాంధీ 76వ వర్ధంతి సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంళవారం ఏర్పాటు చేసిన గాంధీ చిత్రపటానికి డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. కార్ఖానగడ్డలోని గాంధీ విగ్రహానికి టీపీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గాంధీజీ ఆశయాల సాధన కోసం నేటి యువత పాటుపడాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మడుపు మోహన్, పులి అంజనేయులుగౌడ్, శ్రావణ్ నాయక్, వెన్న రాజమల్లయ్య, మల్యాల సుజిత్‌కుమార్, మల్లికార్జున రాజేందర్, పడిశెట్టి భూమయ్య, విక్టర్, ముస్తాక్, వెన్నం రజిత, రాచర్ల పద్మ, రామిడి రాజిరెడ్డి, సిరిపురం నాగప్రసాద్, వంగల విద్యాసాగర్, ఇన్నారెడ్డి, లింగంపల్లి బాబు, అబ్దుల్ రహమాన్, దీకొండ శేఖర్, గడప అజయ్, కంకణాల అనిల్‌కుమార్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.



డీసీసీ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, తదితరులు

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..

కరీంనగర్ టౌన్: జాతిపిత మహాత్మగాంధీ 76వ వర్ధంతి సందర్భంగా పలువురు గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నగునూరి రాజేందర్, మాజీ జిల్లా అధ్యక్షుడు ఏవి మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శి శివనాథుని శ్రీనివాస్, వాసవీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు రాచమల్ల అంజనేయులు, వంగల పవన్, కొలిపాక శ్రీనివాస్, పట్టణ సంఘం ప్రధాన కార్యదర్శి పెద్ది వేణుగోపాల్, తనుకుసాయికృష్ణ, కొంజర్ల శ్రీకాంత్, కన్న సాయి, వైశ్య సంఘం, అభ్యుదయ సంఘాల నాయకులు పాల్గొని ఘనంగా నివాలులర్పించారు. భగత్‌నగర్ రావూస్‌లో మహా త్మాగాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ ప్రభాకర్‌రావు, సీఈవో నితిన్‌రావు, ప్రిన్సిపల్ రహమాన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి కల్యాడపు ఆగయ్య, రొడ్డ శ్రీధర్, ఇట్ట మల్లేశం, ఎస్‌కె హైమద్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

కార్పొరేటర్ జంగిలి సాగర్‌పై రౌడీషీట్

● భూకబ్జా కేసులో ఇద్దరికి బెయిల్ ● మరి కొందరిని విచారించిన పోలీసులు

కరీంనగర్ క్రైం, జనవరి 30 : భూకబ్జాలు, దౌర్జన్యాలకు సంబంధించిన ఫిర్యాదులపై అరెస్టు అయి ప్రస్తుతం జైలులో ఉన్న సీతారాంపూర్ కార్పొరేటర్ జంగిలి సాగర్‌పై పోలీసులు మంగళవారం రౌడీషీట్ తెరిచారు. తన భూమిలో అక్రమంగా రోడ్డు వేసి, తనను బెదిరించి 10 లక్షల రూపాయలు తీసుకున్నాడని, సీతారాంపూర్‌కు చెందిన రిటైర్డ్ టీచర్ తాటిపల్లి లింగారెడ్డి ఫిర్యాదుతో కరీంనగర్ 21వ డివిజన్ కార్పొరేటర్ జంగిలి సాగర్‌పై ఈ నెల 24న కొత్తపల్లి పోలీసు ఠాణాలో కేసు నమోదు చేసి, అదే రోజు జంగిలి సాగర్‌ను అరెస్టు చేసి జైలుకు తరలించారు. అప్పటి నుంచి జైలులోనే ఉన్న జంగిలి సాగర్ బెయిల్‌పై బయటకు వచ్చేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు తాజాగా కొత్తపల్లి ఠాణాలో రౌడీషీట్ తెరచారు. జంగిలి సాగర్ పలు క్రిమినల్ కేసుల్లో నిందితుడని, నేర ఘటనల్లో పాల్గొంటున్నాడని, అతనిపై 2011, 2022, 2023 లలో ఒక్కో కేసు, 2024లో రెండు కేసులు మొత్తం ఐదు కేసులు ఉన్నాయని, అతనిపై రౌడీషీట్ తెరవాలని ప్రతిపాదిస్తూ కొత్తపల్లి ఎస్‌ఐ కరీంనగర్ రూరల్ ఏసీపీకి పంపించగా ఈ మేరకు ఏసీపీ అనుమతి ఇచ్చారు. దీంతో కొత్తపల్లి ఎస్‌ఐ రౌడీషీట్‌ను తెరిచారు. జంగిలి సాగర్ కదలికలను నిత్యం గమనిస్తూ నిఘా ఉంచాలని ఏసీపీ ఆదేశించారు. భూకబ్జాలకు సంబంధించిన కేసులను దర్యాప్తు చేస్తున్న ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్ పోలీసు అధికారులు మాత్రం వారి విచారణలో భూకబ్జా జరిగిందని నిర్ధారణకు వచ్చిన సందర్భంలో మున్సిపల్, రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో ఆ కేసులకు సంబంధించిన పక్కా డాక్యుమెంట్ ఆధారాలను సేకరించి కోర్టుకు సమర్పిస్తున్నట్లు తెలుస్తోంది. భూకబ్జాలకు సంబంధించిన కేసులు, ఫిర్యాదులపై ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్ పోలీసు అధికారులు దర్యాప్తు చేస్తున్నప్పటికీ దీనంతటిని పోలీస్‌కమిషనర్ మానిటరింగ్ చేస్తూ ఎప్పటికప్పుడు తగిన సూచనలు, ఆదేశాలు జారీ చేస్తున్నారు. నిందితులు తప్పించుకోకుండా, త్వరగా బెయిల్ రాకుండా కఠినంగా చర్యలు తీసుకుంటూ పలు సెక్షన్‌లను జోడిస్తూ కేసులను స్ట్రాంగ్ చేస్తున్నారు. మరో వైపున ఫిర్యాదులు వెల్లువెత్తుతుండటంతో బాధితుల సంఖ్య కూడా రోజు రోజుకు పెరుగుతూనే ఉంది. బాధితులకు న్యాయం జరిగేలా, నిందితులు మళ్లీ ఇటువంటి నేరాలకు పాల్పడకుండా భయపడే విధంగా సీపీ చర్యలు చేపట్టి భూకబ్జాలపై ఉక్కుపాదం మోపడాన్ని ప్రజలు హర్షిస్తున్నారు.

● భూకబ్జాకు సంబంధించిన కేసులో ఈ నెల 17న అరెస్టు అయి కరీంనగర్ జిల్లా జైలులో ఉన్న కార్పొరేటర్ తోట రాములు, బీఆర్‌ఎస్ నాయకుడు చీటి రామారావులకు బెయిల్ లభించింది. మంగళవారం ఉదయం ఇద్దరు జైలు నుంచి విడుదలయ్యారు. ఈ నెల 17న ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు రెండుసార్లు పోలీసు కస్టడీకి తీసుకుని విచారించారు. కాగా భూకబ్జాలు, దౌర్జన్యాలపై వచ్చిన ఫిర్యాదులపై మంగళవారం కూడా పలువురిని పోలీసులు విచారించి కొంత సమాచారాన్ని సేకరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థుల దుర్మరణం


మహేష్ (ఫైల్)


వంశీకృష్ణారెడ్డి(ఫైల్)

ఓదెల, జనవరి 30: మండలంలోని గోపరపల్లి శివారులో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఇంటర్ విద్యార్థులు మృతిచెందగా మరొకరు గాయపడ్డారు. గోపరపల్లికి చెందిన దాసరి వంశీకృష్ణారెడ్డి, కాల్వశ్రీరాంపూర్ మండలం పెగడపల్లికి చెందిన జీల మహేష్ , సుల్తానాబాద్ మండలం సుగ్లాంపల్లికి చెందిన పసెట్ల సంజయ్ ముగ్గురు మిత్రులు. ఈ ముగ్గురు ఈ నెల 29న సోమవారం బైక్‌పై కొలనూర్ వైపు వెళ్తుండగా అదుపు తప్పి రోడ్డు పక్కనున్న చెట్టుకు ఢీకొన్నారు. ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. అర్ధరాత్రి దాటిన తర్వాత సుల్తానాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వంశీకృష్ణారెడ్డి(20) మృతిచెందగా, మహేష్(17) కరీంనగర్ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. సంజయ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు

ప్రమాదవశాత్తు బావిలో పడి గొర్రెల కాపరి మృతి

రుద్రంగి జనవరి 30: ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి గొర్రెల కాపరి మృతి చెందిన సంఘటన రుద్రంగి మండలం మానాల శివారులో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండల కేంద్రానికి చెందిన భాగయ్య (24) అనే అనే కూలి మానాల గ్రామానికి గొర్లు మేపేందుకు వచ్చాడు. గొర్లు మేపుతున్న క్రమంలో తాగునీటి కోసం వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. సంఘటన స్థలానికి రుద్రంగి పోలీసులు చేరుకొని గజ ఈతగాళ్లతో మృతదేహాన్ని వెలికి తీశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ బాపిరెడ్డి తెలిపారు.

సర్పంచ్, ఉపసర్పంచ్ సస్పెన్షన్

పెగడపల్లి, జనవరి 30: మండలంలోని నామాపూర్ సర్పంచ్ కరుణాకర్ రెడ్డి, ఉపసర్పంచ్ సంతోష్, పంచాయతీ కార్యదర్శి తిరుపతిలను నిధుల దుర్వినియోగం అభి యోగంలో సస్పెండ్ చేస్తూ కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా మంగళవారం ఉత్తర్వులు జారీచేసినట్లు ఎంపీవో మహేం దర్ తెలిపారు. గ్రామంలో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బోరుబావులతో పాటు ఎంపీ, ఎమ్మెల్యే నిధులతో ఏర్పాటుచేసిన హైమాస్ట్ లైట్లకు గ్రామపంచాయతీ నుంచి నిధులు డ్రా చేసి, నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డారని అదే గ్రామానికి చెందిన ముదుగంటి పవన్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు డీఎల్‌పీవో కనకదుర్గ ఇటీవల గ్రామానికి వచ్చి రికార్డులు పరిశీలించి విచారణ చేసి నోటీసులు జారీ చేశారు. పనుల కు సంబంధించి సరైన ఆధారాలు చూపించక పోవడంతో డీఎల్‌పీవో సమర్పించిన నివేదిక మేరకు సర్పంచ్, ఉపసర్పంచ్, కార్యదర్శులను తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీవో తెలిపారు.

బాలికపై అత్యాచారం

ధర్మపురి, జనవరి 30: పట్టణంలో బాలికపై కొల్లూరి అర్జున్ (21) అనే యువకుడు అత్యాచారం చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణానికి చెందిన అర్జున్ ఇటీవల మైనర్ బాలికపై అత్యాచారం చేయగా ఆమె తల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు యువకుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. ఈ సంఘటనపై జగిత్యాల డీఎస్పీ వెంకటస్వామి విచారణ జరిపారు. అర్జున్‌ను అరెస్ట్ చేసి రిమాండ్ పంపించినట్లు ఎస్ఐ దత్తాత్రి తెలిపారు.

కిటకిటలాడిన కొండగట్టు

● సమ్మక్క భక్తులతో పోటెత్తిన అంజన్న క్షేత్రం ● దైవదర్శనం చేసుకున్న 50వేల మంది


అంజన్న ఆలయం ఎదుట భక్తుల కోలాహలం


క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

మల్యాల, జనవరి 30: కొండగట్టు అంజన్న క్షేత్రం మేడారం జాతరను తలపించేలా మంగళవారం భక్త జనసంద్రంగా మారింది. మేడారంలో జరిగే సమ్మక్కసారక్క జాతర నేపథ్యంలో ముందుగా వేములవాడ రాజన్న, కొండగట్టు అంజన్నకు తొలి మొక్కులు తీర్చుకునేందుకు గాను ఆలయాలను దర్శించడం ఆనవాయితీగా వస్తుండడంతో సమ్మక్క సారక్క భక్తులు కొండగట్టుకు తరలివస్తున్నారు. దాదాపుగా యాభై వేలకు వరకు భక్తులు అంజన్న ను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కిక్కి రిసాయి. సోమవారం రాత్రికే కొండపైకి చేరుకున్న భక్తులు వేకువ జామునుంచే స్వామి వారి దర్శనానికి బారులుతీరారు. కొండంతా భక్తులతో రద్దీగా మారింది. ఆలయానికి వచ్చే మార్గాలు, కోనేరు పరిసరాలు భక్తులతో నిండిపోయాయి. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తుల రద్దీ రోజంతా కొనసాగింది. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో వెంకటేష్, ఏఈవో బుద్ధి శ్రీనివాస్, పర్యవేక్షకులు సునీల్, శ్రీనివాస్‌శర్మ, ఎస్సైలు అశోక్, కుమార స్వామి ఇతర అధికారులు పర్యవేక్షించారు. వందలాది వాహనాలతో ఘాట్‌రోడ్డు, జేఎన్‌టీయూ మార్గం నిండిపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

● ఆర్జిత సేవలతో ఇబ్బందులు..

వేలాదిగా తరలివస్తున్న భక్తుల రద్దీ నేపథ్యంలో మంగళవారం, శనివారం రోజుల్లో కొద్దిరోజుల పాటు వాహనపూజలు, అభిషేకాలను కొనసాగిస్తుండడం తో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహన పూజలకు వచ్చే వాహనాలతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. అలాగే ఆలయం లో అభిషేకాలతోనూ భక్తులకు అసౌకర్యం నెలకొం ది. ముందుగానే దేవ స్థానం అధికారులు సమాచారం అందించి రద్దీ రోజుల్లో ఇబ్బందులు కలగకుండా చూడాలని భక్తులు కోరుతున్నారు.

కొనసాగుతున్న జేఈఈ మెయిన్ పరీక్షలు

తిమ్మాపూర్, జనవరి 30: తొలివిడత జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామ్స్ (జేఈఈ మెయిన్) పేపర్-1 పరీక్షలు మంగళవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెండు పరీక్ష కేంద్రాల్లో ప్రశాంతంగా జరిగింది. మండలం కేంద్రంలోని ఐయాన్ డిజిటల్ జోన్, శ్రీ చైతన్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, పరీక్ష కేంద్రాల్లో రెండు సెషన్‌లలో పరీక్ష నిర్వహించారు. ఉదయం 9 నుంచి 12గంటల మొదటి సెషన్‌లో 827మందికి 815 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 12మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఆరు గంటల వరకు జరిగిన రెండో సెషన్‌లో 634 మందికి 620మంది విద్యార్థులు హాజరు కాగా 14మంది పరీక్షకు హాజరు కాలేదని ఎన్‌టీఏ సిటీ కోఆర్డినేటర్ లలితకుమారి తెలిపారు.


హాల్‌టికెట్‌ను తనిఖీ చేస్తున్న సిబ్బంది

స్వచ్ఛతలో తహెర్‌కొండాపూర్ ఆదర్శం


పారిశుధ్య సిబ్బందితో మాట్లాడుతున్న యునిసెఫ్ జిల్లా సమన్వయకర్త

కరీంనగర్ రూరల్, జనవరి 30: స్వచ్ఛతలో మండలంలోని తహెర్‌కొండాపూర్ గ్రామం ఆదర్శవంతంగా ఉందని ఐదు జిల్లాల శిక్ష ణ బృందం సభ్యులు అన్నారు. సోమ, మంగళవారాల్లో తహెర్‌కొండా పూర్, చర్లబూత్కూర్ గ్రామాల్లో యూనిసెఫ్ సభ్యులు, ఐదు జిల్లాల శిక్షణ బృందం సభ్యులు పర్యటించి ప్రజెంటేషన్ అందించారు. కొమురంభీం ఆసిఫాబాద్, పెద్దపల్లి, రాజన్నసిరిసిల్ల, జగిత్యాల, కరీంనగర్ జిల్లాల నుంచి మండల పంచాయతీ అధికారులు, ఏపీఎం కన్సల్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులతో కూడిన 73 మంది సభ్యుల బృందం, యూనిసెఫ్ జిల్లా సమన్వయకర్త కిషన్‌స్వామి ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికుల రక్షణ, ఆరోగ్యం విషయాలపై రెండురోజుల శిక్షణ కార్యక్ర మంపై తహెర్‌కొండాపూర్, చర్లబూత్కూర్ గ్రామాలను సందర్శించా రు. తహెర్‌కొండాపూర్‌లో మరుగుదొడ్లు, చెత్త నిర్వహణ, మురికినీటి నిర్వహణ, షెడ్డు నిర్వహణ, అంగన్వాడి, మొక్కల పెంపకాన్ని పరిశీలించి, ప్రజెంటేషన్ అందించారు. చర్లబూత్కూర్‌లో పారిశుధ్య కార్మికులతో చర్చించారు. యునిసెఫ్ వాష్ కన్సల్టెంట్ ఫణీంద్రకు మార్, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, ఎంపీవో జగన్‌మోహన్‌రెడ్డి, సర్పంచ్ మమత, మారుతి పాల్గొన్నారు.

ఆటో నుంచి పడి కంప్యూటర్ ఆపరేటర్ మృతి

ధర్మపురి, జనవరి 30: ధర్మపురి మండలంలోని బూరుగుపల్లె వద్ద ఆటో నుండి కింద పడి మ్యాన సంతోష్ (30) అనే కంప్యూటర్ ఆపరేటర్ మంగళవారం మృతి చెందాడు. స్థానిక హనుమాన్‌వాడకు చెందిన సంతోష్ వెల్లటూర్ మండల ప్రజాపరిషత్ ఆఫీస్‌లో డేటా కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. ఉదయం విధులు నిర్వర్తించేందుకు సంతోష్ ఆటోలో బయలుదేరాడు. బూరుగుపల్లె వద్దకు చేరుకున్న ఆటో డ్రైవర్ అజాగ్రత్తగా నడిపి సడెన్‌గా బ్రేక్ వేయడంతో అదుపు తప్పి అందులో ఉన్న సంతోష్ కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే ఆయనను 108 అంబులెన్స్ ద్వారా జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ తరలించారు. సంతోష్ పరిస్థితి విషమించి మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుని భార్య మ్యాన సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దత్తాత్రి తెలిపారు.

బైపాస్ డిజైన్ మార్చాలి


రైతులతో మాట్లాడుతున్న అధికారులు

మెట్‌పల్లి, జనవరి, 30: బైపాస్ రోడ్డు నిర్మాణంలో విలువైన వ్యవసాయ భూములను కోల్పోయి వీధిపాలవుతున్నందున డిజైన్ మార్చేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు కేంద్రం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని రైతులు ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. మండలంలోని బండలింగాపూర్, వెల్లుల్ల, మేడిపల్లి గ్రామాలకు చెందిన రైతులు విలువైన వ్యవసాయ భూములు ఇచ్చేది లేదంటూ భూ సర్వేను నిలిపివేయాలని కొన్ని రోజుల కిందట రిలే దీక్షలను రైతులు చేపట్టారు. దీంతో రైతుల సమస్యలను తెలుసుకోవడానికి మంగళవారం ఆర్డీవో మధు కార్యాలయానికి పిలిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బైపాస్ రోడ్డులో విలువైన సాగు భూములు కోల్పోయి తీవ్రంగా నష్టపోతామన్నారు. ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న భూములను తీసుకుంటే జీవనోపాధి కోల్పోయి ఎలా బతకాలని అధికారులను ప్రశ్నించారు. జాతీయ రహదారుల అధికారులు రైతులను పిలిపించి పరిహారం ఎక్కువ ఇప్పించే ప్రయత్నం చేస్తామని సర్వేను కొనసాగించేందుకు సహకరించాలని కోరారు. దీంతో రైతులు ఈనెల 5తేదీ వరకు సర్వేను నిలిపివేయాలని కోరారు. కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో రాజేశ్వర్, జాతీయ రహదారి అధికారలు, ఆయా గ్రామాల బాధిత రైతులు పాల్గొన్నారు.

అత్యాచారయత్నం కేసులో నిందితుడికి జైలు

కరీంనగర్ లీగల్, జనవరి 30: బాలికపై అత్యాచార యత్నానికి ఒడిగట్టిన కేసులో నిందితుడైన తాళ్ళపల్లి శంకరయ్య (45)కు ఐదు సంవత్సరాల జైలు శిక్ష, వేయి రూపాయల జరిమానా విధిస్తూ కరీంనగర్ రెండో ప్రత్యేక పోక్సోకోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి శ్రీవాణి మంగళవారం తీర్పునిచ్చారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆరెల్లి రాములు కథనం మేరకు జగిత్యాల వెల్లటూర్ మండలం ఎండపల్లి గ్రామానికి చెందిన భార్యాభర్తలు బతుకుదెరువు కోసం చొప్పదండి గ్రామానికి వచ్చి కూలి పనిచేస్తూ జీవిస్తున్నారు. వీరికి ఒక అమ్మాయి, ఒక అబ్బాయి ఉన్నారు. 2020 జూలై 15న ఉదయం భార్యాభర్తలు కూలి పనికి వెళ్లగా ఇద్దరు పిల్లలు ఇంటి వద్దనే ఉన్నారు. వీరిఇంటి పక్కన ఉండే తాళ్ళపల్లి శంకరయ్య మధ్యాహ్నం బాలిక (9)ని తన ఇంట్లోకి తీసుకెళ్లి ఆమెపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. ఆ సమయంలో బాలిక తమ్ముడు అక్కడికి వచ్చి అది చూసి అరవడంతో ఆమెను వదిలి శంకరయ్య పారిపోయాడు. ఈ సంఘటనపై బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై అప్పటి చొప్పదండి ఎస్ఐ వంశీకృష్ణ శంకరయ్యపై కేసు నమోదుచేసి దర్యాప్తు జరిపారు. కేసు విచారణలో సాక్ష్యాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి శ్రీవాణి నిందితుడైన శంకరయ్యకు జైలుశిక్ష, జరిమానా విధించారు.

శాస్త్రీయ కళల పరిరక్షణకు కృషి చేస్తాం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ - రాజన్న క్షేత్రంలో ఘనంగా త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభం




ఆరాధనోత్సవాలను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, పంచరత్న గానం వినిపిస్తున్న కళాకారులు

వేములవాడ, జనవరి 30: శాస్త్రీయ కళలను పరిరక్షించి ప్రజల్లోకి మరింతగా తీసుకువెళ్లడానికి కృషిచేస్తామని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో మంగళవారం ఉదయం త్యాగరాజస్వామి వారి 71వ ఆరాధన ఉత్సవాలను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ శాస్త్రీయ కళల పరిరక్షణకు, మన సంస్కృతిని ప్రతిబింబించేదుకు ఇలాంటి ఉత్సవాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. మన సంస్కృతి, కళల పరిరక్షణకు ప్రభుత్వం తరపున తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వం లో త్వరలోనే వీటీడీఏ సమావేశం నిర్వహిస్తామని, పదేళ్లుగా ఆగిపోయిన అభివృద్ధి పనులను తిరిగి ప్రారంభిస్తామన్నారు. అంతకుముందు ఉదయం ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలోని అర్చకుల బృందం స్వస్తిపుణ్యవచనము చేసి త్యాగరాజ స్వామి చిత్రపటంతో నగర సంకీర్తన నిర్వహించారు. అనంతరం ఆలయ ఓపెన్ స్లాబ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆరాధనోత్సవాల వేదికపై త్యాగయ్య చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించగా, రాష్ట్ర ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన గావించి ఆరాధనోత్సవాలను ప్రారంభించారు. తొలిరోజు కార్యక్రమాలలో భాగంగా తొలుత ఉదయం పాలెపు లక్ష్మణమూర్తి త్యాగరాజస్వామివారి జీవిత విశేషాలను వివరించగా, వి. జ్యోత్స్న లక్ష్మి, ఎం. సువర్ణ, నరహరిశర్మ, హెచ్. సతీష్, మంజుల, రేవతి, సునీత, కళ బృందము పంచరత్న గానం వినిపించారు. స్వర్ణలత, భాగవతారిణి హరికథా గానం చేయగా పద్మప్రియ సంగీత కచేరితో అల రించారు. గుమ్మడి జనార్దన్, వాణి సితార సోలో కచేరి, జె. ఉమాదేవి సంగీత కచేరితో ఆకట్టుకున్నారు. మంగళంపల్లి స్వర్ణలత శాస్త్రీయ సంగీత కచేరి, జి. రేఖ బృందం నృత్య ప్రదర్శన చేయగా, దుర్గా భవాని నాట్యమండలి వారు భక్త తులసీదాస్ చరిత్ర పౌరాణిక నాటకంతో ఆకట్టుకున్నారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి డి కృష్ణప్రసాద్, ఉత్సవాల ఇన్‌చార్జి కే రామయ్యశర్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడి మృతి

చందుర్తి, జనవరి 30: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వృద్ధుడు సోమవారం రాత్రి మృతి చెందిన సంఘటన మండలంలోని జోగాపూర్ గ్రామం లో జరిగింది. గ్రామస్థుల పోలీసుల కథనం ప్రకారం సుతారి లచ్చిరెడ్డి (62) అనే వృద్ధుడు ఈ నెల 23న పొలం వద్ద నుంచి ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తున్నాడు. గ్రామ శివారులోని శివాజీ విగ్రహం సమీపంలో మూడపల్లి చెందిన మరో వ్యక్తి ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడగా చికిత్స పొందుతూ లచ్చిరెడ్డి మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

ద్విచక్ర వాహనదారులపై దాడి... కేసు నమోదు

కరీంనగర్ క్రైం, జనవరి 30: కరీంనగర్ రాజీవ్‌చౌక్‌లో సోమవారం రాత్రి ద్విచక్ర వాహనదారులపై దాడికి పాల్పడిన ఎండీ షాబాద్, ఎండీ సాహిల్‌లపై కేసు నమోదు చేశామని కరీంనగర్ ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన శానగొండ విమలాచారి, వేములవాడ రమేష్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా రాజీవ్‌చౌక్‌లో ఒక ఒక ఆటో ఢీకొట్టింది. ఆటో డ్రైవర్‌ను ఎందుకు ఢీకొట్టావని అడిగినందుకు ఇద్దరిపై ఆటోలో ఉన్న ఇద్దరు వ్యక్తులు కర్రతో తలపై దాడిచేశారు. ఈ ఘటనపై అర్ధరాత్రి ఇరువర్గాల మధ్య గొడవ జరగగా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని చెదరగొట్టారు. బాధితుల ఫిర్యాదుతో నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

బాల కార్మికుడి గుర్తింపు

-యజమానిపై కేసు నమోదు

కరీంనగర్ క్రైం, జనవరి 30: కరీంనగర్ వాసవిస్ట్రీట్‌లోని మాన్సి ఫాషన్ రెడీమేడ్ షాపులో పనిచేస్తున్న రాజస్థాన్‌కు చెందిన బాల కార్మికుడు (14)ను గుర్తించిన పోలీసులు యజమాని కమలేష్కఉమార్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆపరేషన్ స్మైల్ తనిఖీల్లో భాగంగా మంగళవారం తనిఖీ బృందం వెళ్లగా షాపులో బాలుడుని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాలుడిని చేరదీసి సీడబ్ల్యూసీ ఎదుట హాజరుపరిచామని తెలిపారు.

జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు

నలుగురు నిందితుల రిమాండ్

మెట్‌పల్లి, జనవరి 30: జల్సాలకు అలావాటు పడి డబ్బులు సరిపోక పోవడంతో సులువుగా డబ్బులు సంపాదించాలని వ్యవసాయ మోటార్లు, ట్రాక్టర్ ట్రాలీ దొంగతనాలకు పాల్పడిన నలుగురు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మెట్‌పల్లి పోలీసుస్టేషన్‌లో సీఐ లక్ష్మీనారాయణ, ఎస్సై చిరంజీవితో కలిసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మండలంలోని పాటిమీది తండాకు చెందిన గుగ్లావత్ నరేష్, జరుపుల ప్రకాష్, గుగ్లావత్ రవిలాల్, గుగ్లావత్ అనిల్ జల్సాలకు అలావాటు పడి మద్యానికి బానసయ్యారు. వీటికి డబ్బులు సరిపోకపోవడంతో మూడు నెలల నుంచి మండలంలోని జగ్గసాగర్, ఆత్మకూర్, వెల్లుల్ల గ్రామాలతో పాటు మల్లాపూర్ పరిసర ప్రాంతాలలో దొంగతనాలకు పాల్పడుతున్నారు. 2023 నవంబరు 10న ఆత్మకూర్‌లోని వ్యవసాయ మోటార్లు దొంగతనం చేద్దామని వెళ్తుండగా గ్రామంలో ట్రాక్టర్ ట్రాలీని దొంగలించారు. గ్రామ శివారులోని పొలాల పొదల్లో దాచి పెట్టి, రెండు వ్యవసాయ మోటార్లను దొంగలించి ట్రాలీ వద్ద దాచిపెట్టారు. 12 రోజుల తర్వాత మల్లాపూర్ మండలంలోని రాఘవుపేటలోని నాలుగు వ్యవసా య మోటర్లు, ఈనెల 10న వెల్లుల్ల శివారులోని రెండు మోటర్లను అప హరించారు. మళ్లీ ఈనెల 23న ఆత్మకూర్‌లోని మూడు వ్యవసాయ మోటార్లు దొంగలించారు. దొంగిలించిన మోటర్లను నిజామాబాద్‌లో అమ్మితే ఎక్కువ డబ్బులు వస్తాయని తెలుసుకొని ఈనెల 30న బయలు దేరారు. సీఐ లక్ష్మీనారాయణ ఆదేశాల మేరకు ఎక్స్ రోడ్డు వద్ద ఎస్సై చిరంజీవి తన సిబ్బందితో నిందితులను పట్టుకున్నారు. వారినుంచి ట్రాక్టర్ ట్రాలీ, 11 వ్యవసాయ మోటర్లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. నిందితులను పట్టుకున్న ఎస్సై, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.


నిందితుల అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ, సీఐ

'అచీవర్స్'లో క్రీడా విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతుల ప్రదానోత్సవంలో పాఠశాల డైరెక్టర్ వెంకటేశ్వర్లు

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 30: కోతిరాంపూర్‌లోని అచీవర్స్ ఆక్టివ్ పాఠశాలలో గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని నిర్వహించిన వార్షిక క్రీడోత్సవాలలో విజేతలకు మంగళవారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ సి.హెచ్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులలో క్రీడా స్ఫూర్తిని నింపడానికి ఆటల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పల్లవి పాల్గొన్నారు.

ఉత్తమ ఐఎంఏ అధ్యక్షుడికి సన్మానం



డాక్టర్ రామ్‌కిరణ్‌ను సన్మానిస్తున్న రాష్ట్ర ఐఎంఏ నాయకులు బీఎస్‌రావు

సుభాష్‌నగర్, జనవరి 30: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జాతీయస్థాయి ఉత్తమ అధ్యక్షుడిగా కరీంనగర్ ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ పొలాస రాంకిరణ్ ఎంపిక కాగా ఆయనను ఐఎంఏ ప్రతినిధులు సన్మానించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర మాజీ ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ బీఎస్‌రావుతోపాటు రాష్ట్ర ఐఎంఏ నాయకులు డాక్టర్ కాళీప్రసాద్, డాక్టర్ బీఎన్‌రావు, డాక్టర్ విజయరావు, డాక్టర్ గుత్త సురేష్, డాక్టర్ రవీందర్‌రెడ్డి, డాక్టర్ మహేశ్, డాక్టర్ విజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొలాస రాంకిరణ్ మాట్లాడుతూ కరీంనగర్ ఐఎంఏ ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాలు నిర్వహించారని పేర్కొన్నారు. ఐఎంఏచే నిర్వహింప బడుతున్న ఆవో గావ్ చెలే వైద్య శిబిరాలు దేశంలోనే ఎక్కువగా నిర్వహిం చామన్నారు. తనకు సహకరించిన వారందరికి డాక్టర్ రాంకిరణ్ కృతజ్ఞతలు తెలియచేశారు.

కరాటేలో కోరా జాన్సన్ విద్యార్థుల ప్రతిభ

గణేశ్‌నగర్, జనవరి 30: నగరంలోని పద్మావతి కల్యాణ మండపంలో జనవరి 28న జరిగిన మూడవ స్టేట్ లెవల్ ఆల్ స్టైల్ కుంగ్ ఫూ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో కోరా జాన్సన్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. 5వ తరగతి విద్యార్థులు లాస్యశ్రీ గోల్డ్ మెడల్, ఏమ్.మనస్విని సిల్వర్ మెడల్ ,2వ తరగతి రుత్విక్ వెండి బహుమతులు సాధించారు. విద్యార్థులను పాఠశాల చైర్మన్ మహిపాల్‌రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, సింహాచలం హరికృష్ణ, వంగల సంతోష్‌రెడ్డిలు అభినందించారు.

కాంగ్రెస్‌లో చేరికలు

కరీంనగర్ రూరల్, జనవరి 30: కరీంనగర్ రూరల్ మండలం మందులపల్లి గ్రామ సర్పంచ్ యర్వరాజమల్లుతో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కరీంనగర్ అసెంబ్లీ నియోజక వర్గ ఇన్‌ఛార్జి పురమల్ల శ్రీనివాస్ మంగళవారం కాంగ్రెస్ కండువాలు కప్పారు. పార్టీలో చేరిన వారిలో ఉప సర్పంచ్ మేకల శకుంతలగోవర్ధన్, వార్డు సభ్యులు ఉన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి రాంరెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎండిషహనవాజ్, ఎస్సీ సెల్ కన్వీనర్ అంజయ్య, రవీందర్ తదతరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకం

గణేశ్‌నగర్, జనవరి30: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఓటరు నమోదు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకులు జక్కుల నాగరాజు, ద్యావ మధుసూదన్ రెడ్డి, సత్తినేని శ్రీనివాస్, గవ్వ వంశీధర్ రెడ్డి, బండ వేణు, శాయికృష్ణ, ప్రదీప్, శ్రావణ్, తరుణ్, యశ్వంత్, ఓంకార్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కరీంనగర్ క్రైం, జనవరి 30: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ పర్స రమేష్ అన్నారు. మంగళవారం కరీంనగర్ నెహ్రూ యువకేంద్ర కార్యాలయంలో 50మంది యువకులతో కమ్యూనిటీ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ, ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు.

రగ్బీ జిల్లా స్థాయి ఎంపిక పోటీలకు విశేష స్పందన

శంకరపట్నం, జనవరి 30: శంకరపట్నం మండలం తాడికల్ గ్రామంలోని గ్రామీణ క్రీడా మైదానంలో మంగళవారం జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు చిరంజీవిచారి, ప్రధాన కార్యదర్శి రంగు నిరంజన్ ఆధ్వర్యంలో రగ్బీ అండర్-14 బాలబాలికల ఎంపిక పోటీలను నిర్వహించారు. ఈ క్రీడ పోటీలకు జిల్లాలోని వీణవంక, హుజూరాబాద్, మానకొండూర్, కరీంనగర్, శంకరపట్నం మండలాల నుంచి 150మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులను యదాద్రి జిల్లా భువనగిరిలో ఫిబ్రవరి 3,4వ తేదీలలో జరగబోయే రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొంటారని వారు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రగ్బీ అసోసియేషన్ చీఫ్ పాట్రన్ కొరిమి సంతోష్, ఎగ్జిక్యూటీవ్ సభ్యులు కొడూరి సాయి, రాహుల్, పీఈటీలు సుమన్, కుమార్, తిరుపతి, నరేష్, శ్రీనివాస్, ముఫాజిల్, భరత్, కవిత, రేణుక, మనిషా తదితరులు పాల్గొన్నారు.

హుండీలో డబ్బులు ఎత్తుకెళ్లిన దుండగులు

శంకరపట్నం, జనవరి 30: మండలంలోని గద్దపాకలోగల పోచమ్మ గుడిలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హుండీ తాళం పగలగొట్టి డబ్బులు ఎత్తుకెళ్లారు. పూజారి చంద్రమౌళి, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం పోచమ్మ గుడి తలుపులు తెరిచి చూసేసరికి హుండీ తాళం పగలగొట్టి ఉంది. అందులో ఉన్న నగదును గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిన్లు వారు తెలిపారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న ఎంపీపీ పావని

ఇల్లందకుంట, జనవరి 30: సమాజంలో బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని ఎంపీపీ సరిగోమ్ముల పావని-వెంకటేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో జిల్లా సంక్షేమ శాఖ సమగ్ర బాలల అభివృద్ధి విభాగం ఆధ్వర్యంలో హుజూరాబాద్ సీడీపీవో భాగ్యలక్ష్మి అధ్యక్షతన మండల బాలల పరిరక్షణ కమిటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ పావని మాట్లాడుతూ బాల కార్మిక, బాల్య వివాహాల నిర్మూలన, లైంగిక వేధింపులు తదితర చట్టాలపై అంగన్‌వాడీ కార్యకర్తలు, ప్రభుత్వ ఉపాధ్యాయులకు, అధికారులకు అవగాహన కలిగి ఉండాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ రాణి, ఎంపీడీవో శంకర్, బాలల పరిరక్షణాధికారి రమేష్, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 సూపర్‌వైజర్ కుమారస్వామి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, ఏపీఎం రమాదేవి పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

హుజూరాబాద్‌రూరల్, జనవరి 30: మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు అందిపుచ్చుకొని ముందుకెళ్లాలని టాస్క్ సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్ ప్రవీణ్ మాదరి అన్నారు. మండలంలోని సింగాపూర్‌లో గల వీఎస్‌ఆర్ డిగ్రీ కళాశాలలో సాఫ్ట్ స్కిల్స్‌పై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతీ విద్యార్థి లక్ష్యాన్ని ఏర్పరుచుకొని ముందుకు వెళ్లాలన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్, జీపీటీ, చాట్‌జి కోర్సుల కు డిమాండ్ ఉందని, విద్యార్థులు డిజిటల్ ఎడ్యూకేషన్‌పై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వివిఎన్ హనుమకుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

మహాత్మాగాంధీకి ఘన నివాళి



జమ్మికుంటలో నివాళులర్పిస్తున్న వాసవి క్లబ్ సభ్యులు

భగత్‌నగర్, జనవరి 30: జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరేష్‌పటేల్, తిరుపతి ఆధ్వర్యంలో పూల మాల వేసి నివాళులు అర్పించారు. నగరం లోని డీవైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో గాంధీజీ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్ర మంలో రాజు, కిషన్‌నాయక్, కృష్ణ, వెంకటేష్, నితిన్, రాజేందర్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

●**కరీంనగర్ రూరల్:** మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని కోతిరాంపూర్‌లోని గాంధీ విగ్రహానికి కరీంనగర్ కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్ పూల మాల వేసి నివాళులు అర్పించారు.

●**జమ్మికుంట రూరల్:** జమ్మికుంట పట్టణంలోని గాంధీ చౌరస్తాలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు గాంధీ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి, పూల మాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా రైస్ మిల్లర్ల సంఘం మాజీ అధ్యక్షుడు బచ్చు భాస్కర్, మహాసభ జిల్లా అధ్యక్షుడు చందా రాజు, వాసవి క్లబ్ అధ్యక్షుడు లెంకలపెల్లి శరత్‌కుమార్ పాల్గొన్నారు.

●బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాడ గౌతం రెడ్డి, జీడి మల్లేష్, శీలం శ్రీనివాస్, ఆకుల రాజేందర్, తూర్పాటి రాజు, దొంతుల రాజ్‌కుమార్, రాజేష్ ఠాకూర్, కైలాస కోటి గణేష్, రాజు, రాకేష్, రాము, చైతన్య రెడ్డి, జయ ప్రకాష్, సుధాకర్‌రెడ్డి, శివ కుమార్, పరుశురామ్, విజయ్, రవి తదితరులు పాల్గొన్నారు.

●**తిమ్మాపూర్:** మండలంలోని మన్నెంపల్లిలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు తూముల శ్రీనివాస్, నాయకులు రావుల శ్రీనివాస్ గౌడ్, కనకయ్య పాల్గొన్నారు.

భగవద్గీత పఠనంలో వింధ్యావాలి విద్యార్థుల ప్రతిభ

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 30: జిల్లా స్థాయి భగవద్గీత పఠనంలో వింధ్యావాలి విద్యార్థులు ప్రతిభ చాటారు. చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన భగవద్గీత స్లోకాల పఠన పోటీలను నిర్వహించారు. మంగళవారం పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జి ప్రశాంత్ విద్యార్థులకు బహుమతులను అందించారు. పాఠశాల చైర్మన్ రామవరం లక్ష్మీప్రకాశ్‌రావు, వైస్ చైర్మెన్ ఆర్ పృథ్వీరావు విద్యార్థులను అభినందించారు.

సమ్మక్క సారలమ్మ టెండర్లు వాయిదా

కరీంనగర్ కల్చరల్, జనవరి 30: రేకుర్తి సమ్మక్క సారలమ్మ జాతరలో భాగంగా మంగళవారం నిర్వహించిన వేలాల్లో హెచ్చు పాటలు రానందున టెంకాయల అమ్మకం, కొబ్బరి ముక్కల ప్రోగు, లడ్డూ పులిహోర అమ్మకాలకు టెండర్లు వాయిదా పడినట్లు జాతర అధికారి ఎండపల్లి మారుతి ఒక ప్రకటనలో తెలిపారు. నాల్గవసారి తిరిగి ఫిబ్రవరి 3వ తేదీన ఉదయం 11 గంటలకు వేలాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కాగా ఈ నెల 20న తలనీలాలు, బెల్లం అమ్ముకునే హక్కు కోసం వేలములు జరిగాయని తెలిపారు.

●చింతకుంటలో ఫిబ్రవరి 2వ తేదీ ఉదయం 11 గంటలకు పార్కింగ్, తలనీలాలతో పాటు బెల్లం, పూజాద్రవ్యాలు, కూల్‌డ్రింక్స్ అమ్ముకునేందుకు వేలములు నిర్వహిస్తున్నట్లు జాతర అధికారి నాగుల అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

దాస్యం సేనాధిపతికి పురస్కారం ప్రదానం

కరీంనగర్ కల్చరల్, జనవరి 30: తెలంగాణ సాహిత్యపరిషత్తు ధర్మనిధి సాహిత్య పురస్కారంలో భాగంగా జిల్లాకు చెందిన కవి, విమర్శకుడు దాస్యం సేనాధిపతి మడుపు కులశేఖరరావు సాహిత్య పురస్కారం అందుకున్నారు. మంగళవారం రాత్రి హైదరాబాద్‌లోని పరిషత్తు ప్రాంగణంలో గల దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో మాజీ ఎంఎల్‌సి ఎం రాంచందర్‌రావు, పరిషత్తు అధ్యక్ష కార్యదర్శులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, డాక్టర్ జుర్రు చెన్నయ్య చేతుల మీదుగా పురస్కారం కింద 5వేల రూపాయలు అందజేసి జ్ఞాపిక, శాలువాతో సేనాధిపతిని సత్కరించారు.

'బండి సంజయ్‌పై విమర్శలు చేస్తే సహించం'

కరీంనగర్ రూరల్, జనవరి 30: కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌పై విమర్శలు చేస్తే సహించేది లేదని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం రేకుర్తిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చొప్పదండి మాజీ శాసన సభ్యుడు బండి సంజయ్‌ను విమర్శించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

'ఎన్నికల్లో ఓడినా బీఆర్‌ఎస్ నేతలకు బుద్ధి రాలేదు'

భగత్‌నగర్, జనవరి 30: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా బిఆర్‌ఎస్ నాయకులకు బుద్ధి రాలేదని బీజేపీ దళితమోర్చా జిల్లా అధ్యక్షుడు సోమిడి వేణుప్రసాద్ అన్నారు. మంగళవారం నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సుంకె రవిశంకర్ ఓరాజకీయ అజ్ఞాని అని అవగాహన లేకుండా మాట్లాడుతున్నాడన్నారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ 9వేల కోట్లతో అభివృద్ధి పనులు చేశాడన్నారు.

317 జీవో బాధిత స్టాఫ్ నర్సులకు న్యాయం చేయాలి


మాట్లాడుతున్న శ్రీనివాస్‌కర్ణ

సుభాష్‌నగర్, జనవరి 30: 317 జీవో వల్ల బదిలీ అయి ఇబ్బందులు పడుతున్న స్టాఫ్ నర్సులకు న్యాయం చేయాలని తెలంగాణ ప్రజా ఆరోగ్య ఉద్యోగుల సంఘం(హెచ్-1) రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎన్ శ్రీనివాస్ కర్ణ, రాష్ట్ర జాయింట్ జనరల్ సెక్రెటరీ అఫ్జాబ్ అహ్మద్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం నగరంలో ముఖ్య కార్యవర్గం సమావేశంలో వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖలో జీవో నెంబరు 317 తీసుకు వచ్చి ఉద్యోగులకు సంబంధించి ఎలాంటి స్థానికతను పరిగణలోకి తీసుకోకుండా బదిలీలు చేసిందని ఆరోపించారు. వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న జిల్లాలకు బదిలీ చేసి, కేవలం మూడు రోజుల గడువు ఇచ్చి ఆన్‌లైన్‌లో ఆప్షను ఎంచుకోవాలని ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఉద్యోగులు తమ స్వంత జోన్ ఆప్షన్ పెట్టుకున్నా ప్రాధాన్యత ఇవ్వకుండా బదిలీ చేశారన్నారు. బాధిత స్టాఫ్ నర్సులను వారి స్వంత జిల్లాలకు బదిలీ చేసిన తరువాతనే కొత్తవారికి పోస్టింగులు ఇవ్వాలని కోరారు.

'గ్రామీణ ఓటర్లను చేరుకోవడమే లక్ష్యం'

భగత్‌నగర్, జనవరి 30: గ్రామీణ ఓటర్లను చేరుకోవడమే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని బీజేపీ సీనియర్ నాయకులు, గావ్ చలో అభియాన్ ప్రోగ్రాం రాష్ట్ర కన్వీనర్ రంజిత్ మోహన్ అన్నారు. మంగళవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో గావ్ చలో అభియాన్ ప్రోగ్రాం సమావేశం జిల్లా కన్వీనర్ మేకల ప్రభాకర్ యాదవ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల నుంచి జిల్లాలో గావ్ చలో అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి బీజేపీ శ్రేణులు కృషి చేయాలన్నారు. మోదీ ప్రభుత్వ విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, ఇనుగొండ నాగేశ్వర్‌రెడ్డి, మాడ వెంకటరెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు, ఎర్రబెల్లి సంపత్‌రావు, వెంకటరెడ్డి, రంగు భాస్కరాచారి, జిల్లా అధికార ప్రతినిధులు బొంతల కళ్యాణ చంద్ర, జానపట్ల స్వామి, అలివేలు సమ్మిరెడ్డి మీడియా కన్వీనర్ కటకం లోకేష్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సంపత్, బండారి గాయత్రి, మైనార్టీ మోర్చా ప్రధానకార్యదర్శి ఎండి ముజీబ్, ముత్యాల జగన్‌రెడ్డి, మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

'ఓటమి భయంతోనే వినోద్‌కుమార్‌పై విమర్శలు'


మాట్లాడుతతున్న సిరిసిల్ల జడ్పీ వైస్ చైర్మన్ సిద్దం వేణు

గణేశ్‌నగర్, జనవరి 30: ఎంపీ ఎన్నికల్లో ఓటమి భయంతోనే వినోద్‌కుమార్‌పై బీజేపీ నాయకులు విమర్శలు చేస్తున్నారని సిరిసిల్ల జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు అన్నారు. కులాలు, మతాల మీద రాజకీయం చెయ్యడం మానుకోవాలని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బండి సంజయ్‌కి ఓటమి తప్పదని ఆయన అన్నారు. మంగళవారం కరీంనగర్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినోద్ కుమార్ పేరు చెబితే బండి సంజయ్ కుమార్‌కు నిద్ర పట్టడం లేదన్నారు. స్మార్ట్‌సిటీ నిధులు తెచ్చిన వ్యక్తి వినోద్‌కుమార్ అని గుర్తు చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి, జక్కుల నాగరాజుయాదవ్, తిరుపతినాయక్, కేంసారం తిరుపతి, ద్యావ మధుసూదన్‌రెడ్డి, శ్రావణ్ పటేల్, వేణుయాదవ్, సాయికృష్ణ, ఓంకార్, ప్రదీప్, జస్వంత్ పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలన: ఎమ్మెల్యే


తాడికల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

శంకరపట్నం, జనవరి 30: ప్రజల ఆశలు ఆకాంక్షలు నెరవేర్చే విధంగా పరిపాలన కొనసాగిస్తామని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మంగళవారం శంకరపట్నం మండలంలోని తాడికల్‌లో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం నూతన భవనాన్ని ప్రారంభించారు. అలాగే మొలంగూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో సైన్స్ ల్యాబ్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తాడికల్ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేసిందన్నారు. పది సంవత్సరాలుగా ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోకుండా గాలికి వదిలేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆశలకు అనుగుణంగా వారి ఆశయాల సాధనలో పాలన కొనసాగిస్తోందన్నారు. సమావేశంలో సర్పంచ్‌లు, తహసీల్దార్ అనుపమ, ఎంపీడీవో శ్రీవాణి, డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు, సంబంధిత శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్: ఎంపీ ఎన్నికల్లోపు ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని, ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 10లక్షల ఆరోగ్య భీమ పథకాన్ని ప్రారంభించామని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. తిమ్మాపూర్ లో గ్రామపంచాయితీ భవనం, వాటర్ ప్లాంట్, క్రీడామైదానాలు ప్రారంభించి ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం కోసం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం మన్నెంపల్లిలో క్రీడా మైదానం వైకుంఠధామం, నర్సరీని ప్రారంభించి, పైపు లైన్ కోసం భూమి పూజలు చేశారు. జుగుండ్ల గ్రామంలో అంబేద్కర్ సంఘం, కురుమ సంఘం, మహిళా సంఘం నూతన భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గత ఎన్నికల్లో ప్రజలు తనకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించినందుకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలియజేశారు. గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించి తన పరిపాలనను ముగించుకుంటున్న సర్పంచ్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. తమ పదవి ముగించుకుంటున్న సర్పంచ్‌లకు, పాలక వర్గ సభ్యులకు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఘనంగా సన్మానించి, అభినందించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ కేతిరెడ్డి వనితదేవేందర్‌రెడ్డి, సర్పంచ్‌లు దుండ్ర నీలమ్మ రాజయ్య, మేడి అంజయ్య, ఉపసర్పంచ్‌లు కేతిరెడ్డి తిరుపతి రెడ్డి, పొన్నం అనిల్ గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణా రెడ్డి, ఎంపీడీవో రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

'జడ్పీటీసీని అవమానించడం సిగ్గుచేటు'

మానకొండూర్, జనవరి 30: మానకొండూర్ మండల సర్వసభ్య సమావేశంలో జడ్పీటీసీ తాల్లపల్లి శేఖర్‌గౌడ్‌కు వేదికపై సీటు లేదని అవమానించడం సిగ్గుచేటని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు విమర్శించారు. మానకొండూర్‌లోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1991లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించిన కాలం చెల్లిన జీవోను చూపిస్తూ వేదిక మీద కుర్చీ లేకుండా చేయడమే కాకుండా ప్రశ్నించిన జడ్పీటీసీని పోలీసులతో బయటకు పంపిన నీచచరిత్ర కాంగ్రెస్ పార్టీదని ఆయన ఆరోపించారు. ఎంపీపీ ముద్దసాని సులోచన, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కక్షసాధింపు చర్యలకు పాల్పడడం హేయమైన చర్య అన్నారు. కక్షసాధింపు చర్యలకు పాల్పడకుండా అభివృద్ధిపై దృష్టి సారించాలని ఆయన హితువు పలికారు. కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జడ్పీ వైస్ చైర్మన్ సిద్దం వేణు, స్థానిక జడ్పీటీపసీ తాల్లపల్లి శేఖర్‌గౌడ్, శంకరపట్నం, గన్నేరువరం ఎంపీపీలు శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మానకొండూర్ సర్పంచు రొడ్డ పృథ్వీరాజ్ నాయకులు పాల్గొన్నారు.

పదో తరగతి టాపర్లకు నగదు పంపిణీ

మానకొండూర్, జనవరి 30: మానకొండూర్‌లోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో 2022-23 విద్యా సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మంగళవారం నగదు పంపిణీ చేశారు. మానకొండూర్‌లో ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉన్నతస్థాయికి ఎదిగి మృతి చెందిన నారాయణగౌడ్ జ్ఞాపకార్థం ప్రతి ఏటా టాపర్లకు నగదు పంపిణీ చేస్తున్నారు. బాలుర పాఠశాలకు చెందిన కె. మణితేజ, బాలికల పాఠశాలకు చెందిన ఎం. వరలక్ష్మిలకు ఒక్కొక్కరికి రూ. 10వేల చొప్పున శోభారాణి, అనురాధ, నరహరి గౌడ్ చేతుల మీదుగా నగదు పంపిణీ చేశారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, జ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాలువ పనులు పూర్తి చేయాలి

గంగాధర, జనవరి 30: గంగాధరలో నల్ల చెరువుకు నిర్మిస్తున్న కాలువ పనులు పూర్తి చేయాలని గంగాధర రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం గంగాధర వాగులో గ్రామానికి చెందిన రైతులు కాలువ పనులను పరిశీలించారు. ఈసందర్భంగా గత కొన్ని సంవత్సరాలుగా కురిసిన వర్షానికి వరద నీటితో కాలువ పూడ్చుకుపోయిందన్నారు. ఈ కాలువ ద్వారా వచ్చే నీరు నల్ల చెరువుకు పోతుండేదన్నారు. ఇటీవల ప్రభుత్వం మూడు లక్షల రూపాయలు మంజూరు చేయగా కాంట్రాక్టర్ పనులుపూర్తి చేయకుండానే వదిలేశాడని రైతులు ఆరోపించారు. గంగాధర నల్ల చెరువు నిండితే 150 ఎకరాల ఆయకట్టు సాగులోకి వస్తుందన్నారు. కాలువ పూర్తి చేయకపోతే వరద నీరంత వాగులో పడి వృధాగా పోతుందన్నారు. అధికారులు ఎవ్వరు పట్టించుకోవడంలేదని కాలువ పూర్తి చేయించి నల్ల చెరువు నిండేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

ఎక్స్‌ప్రెస్ రైలుకు స్వాగతం పలికిన బీజేపీ నాయకులు


రైలుకు స్వాగతం పలుకుతున్న గంగాడి కృష్ణారెడ్డి

జమ్మికుంట, జనవరి 30: జమ్మికుంట రైల్వేస్టేషన్‌లో యశ్వంత్‌పూర్-గోరక్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలుకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మంగళవారం స్వాగతం పలికారు. ఎక్స్‌ప్రెస్ రైలుకు జమ్మికుంటలో హాల్టింగ్ కోసం కృషిచేసిన ఎంపీ బండి సంజయ్‌కుమార్, ప్రధాని నరేంద్ర మోదీ, రైల్వే మంత్రి అశ్విన్‌కుమార్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం కృష్ణారెడ్డి మాట్లాడుతూ వ్యాపార కేంద్రమైన జమ్మికుంటలో మరికొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిపేందుకు ఎంపీ బండి సంజయ్ కుమార్ ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. కార్యక్రమంలో మాడ గౌతంరెడ్డి, జీడి మల్లేష్, శీలం శ్రీనివాస్, ఆకుల రాజేందర్, తూర్పాటి రాజు, దొంతుల రాజ్‌కుమార్, రాజేష్ ఠాకూర్, బూరుగుపల్లి రాము, చైతన్యరెడ్డి, శిల జయప్రకాష్, మేక సుధాకర్‌రెడ్డి, బచ్చు శివకుమార్, గుర్రం పరుశురామ్, విజయ్, సమ్మయ్య, నవీన్, పాపయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

బట్టల షాపులో అగ్నిప్రమాదం

కరీంనగర్ క్రైం, జనవరి30: కరీంనగర్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్ కాంప్లెక్స్‌లోని షాపు నెంబరు బీ3 జ్యోతి డ్రెస్సెస్‌లో మంగళవారం రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. విద్యుత్ మీటర్‌లో మంటలు అంటుకుని దుకాణంలోని బట్టలు, ఫర్నిచర్ కొంత మేరకు కాలిపోయాయి. సమాచారం అందుకున్న కరీంనగర్ ఫైర్ ఆఫీసర్ ఫైరింజన్‌తో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. అగ్నిప్రమాదంలో నష్టం అంచనా వేస్తున్నట్లు ఫైర్ ఆఫీసర్ పరమేశ్వర్ తెలిపారు.

'వారధి' అక్రమాలపై విచారణ జరిపించాలి

కరీంనగర్ టౌన్, జనవరి 30: జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా రిటైర్డు ప్రభుత్వోద్యోగి ఆంజనేయులు సెక్రటరీ నిర్వహణలో ఉన్న వారధి సొసైటీలో అనేక అక్రమాలు జరుగుతున్నాయని, వాటిపై విచారణ జరిపించాలని మాజీ కార్పొరేటర్, న్యాయవాది ఏవి రమణ కోరారు. సెక్రెటరీ ఆంజనేయులు ఒంటెద్దు పోకడ, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అక్రమాలు జరుగుతున్నాయన్నారు.

విద్యార్థిని మృతి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

సుభాష్‌నగర్, జనవరి 30: చింతకుంటలోని గురుకుల పాఠశాల విద్యార్థిని మృతి చెందిన సంఘటపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రాహ్మణపల్లి యుగేందర్ డిమాండ్ చేశారు. హౌజ్‌మాస్టర్, ప్రిన్సిపాల్‌ను సర్వీస్ నుంచి రిమూవ్ చేయాలన్నారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన

సుభాష్‌నగర్, జనవరి 30: మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని జాతీయ కుష్ఠు నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. మంగళవారం నగరంలోని కట్టరాంపూర్‌లో గల అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో కుష్ఠు వ్యాదిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ ఆకుల నర్మద ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

భగవద్గీత పారాయణం

కరీంనగర్ కల్చరల్, జనవరి 30: మహాత్మాగాంధి వర్ధంతి సందర్భంగా మంగళవారం గాంధీరోడ్‌లోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద గీతాభక్త సమాజం సభ్యులు శ్రీమద్భగవద్గీత 2వ అధ్యాయం పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు బండ సత్తయ్య, కార్యనిర్వాహకుడు ఉప్పల రామేశం సభ్యులు పాల్గొన్నారు.

● సంక్షిప్త సమాచారం..

●భగత్‌నగర్: జగిత్యాలలో కార్మికులు, పేదల పక్షాన పోరాటం చేసిన సీఐటీయు, రైతు సంఘం నాయకులను బేడీలు వేసి తీసుకెళ్లడం దుర్మార్గమైన చర్య అని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముకుందరెడ్డి, ఎడ్ల రమేష్‌లు అన్నారు. మంగళవారం కరీంనగర్ జిల్లా జైలు నుండి జగిత్యాల కోర్టుకు తరలించే క్రమంలో సిఐటియు, రైతు సంఘాల నాయకులు లెక్కల బాలకృష్ణ, జి తిరుపతి నాయక్, రమేష్‌లను బేడీలు చేతులకు బేడీలు వేసి తీసుకెళ్లటం దుర్మార్గం అన్నారు.

●గణేశ్‌నగర్, జనవరి30: పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ డైరీని ట్రాన్స్ కో చీఫ్ ఇంజనీర్, రామ్‌ప్రసాద్ మంగళ వారం పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ కార్యాల యంలో అసోసియేషన్ డైరీ ఆవిష్కరించారు.కార్యక్రమంలో కరీంనగర్ ఇంజనీర్స్ గెస్ట్‌హౌస్‌లో ఎన్.అంజయ్యగౌడ్ బ్రాంచ్ సెక్రెటరీ స్పెషల్ గెస్ట్ అడిషనల్ సెక్రెటరీ జనరల్ అంజయ్య జాయింట్ సెక్రెటరీ రమేష్ పాల్గొన్నారు.

భగత్‌నగర్, జనవరి 30: తెలంగాణరాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కరీంనగర్-2 డిపోలో ప్రతిభకనబరిచిన ఉత్తమ డ్రైవర్లు, కండక్టర్లకు బహుమతులు అందించారు. ఉత్తమ డ్రైవర్లుగా వి రాజన్న, డిఎం రెడ్డి, కండక్టర్‌లుగా పిఐ రావులను సన్మానించారు. ఈకార్యక్రమంలో డిపో మేనేజర్ వి మల్లయ్య అసిస్టెట్ మేనేజర్ పివి లక్ష్మి, ఎంఎఫ్ తిరుపతి, సీనియర్ ట్రాఫిక్ ఎస్ఐ ఎంకమల, సెక్యూరిటి హెడ్ కానిస్టేబుల్ డిఎల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

●కరీంనగర్ టౌన్: ఖమ్మంలో ఫిబ్రవరి 11,12 తేదీల్లో నిర్వహించనున్న టిపిటిఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలో జిల్లా విద్యాధికారి వి.జనార్ధన్‌రావు చేతుల మీదుగా మహాసభ పోస్టరున ఆవిష్కరించారు.

●చొప్పదండి: మండలంలోని మంగళపల్లిలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ చిలుక రవీందర్ ముఖ్యఅతిథిగా హాజరై మట్లాడారు. కుల, మతరహిత వివక్ష నిర్మూలనకు ప్రతి ఒక్కరు పాటుపడాలని ఆయన కోరారు. సర్పంచ్ వెల్మ నాగిరెడ్డి, ఎంపీటీసీ వెల్మ విజయలక్ష్మి పాల్గొన్నారు.

●హుజూరాబాద్‌రూరల్: మండలంలోని జూపాక వీహెచ్‌పీ గ్రామ అధ్యక్షుడిగా రావుల సురేష్, ఉపాధ్యక్షులు పంజాల రవిశాస్త్రి, కార్యదర్శిగా నవీన్, బజరంగదళ్ ప్రముఖ్‌గా మార్క శివ, గోరక్ష ప్రముఖ్‌గా రావుల కరుణాకర్, కోశాధికారిగా పింగిళి దేవేందర్‌రెడ్డి నియామకమ య్యారు.

●హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సిర్సపల్లిలో ఇరుకు రోడ్లు ఉండటంతో గ్రామస్థులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రోడ్డు విస్తరణ కోసం ఇళ్లను తొలగించుకునేందుకు ముందుకు వచ్చారు. మంగళవారం సర్పంచ్ ఎడ్ల సువర్ణల సునీయం విజయ్‌కుమార్ సమక్షంలో రోడ్డు విస్తరణ కోసం ఇళ్లను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు.

●సైదాపూర్: మండలానికి చెందిన మొలుగూరి తిరుపతి, దండవేణ శిరీష, స్వాతి స్టాఫ్ నర్సులుగా ఉద్యోగం సాధించారు.

●హుజూరాబాద్: పట్టణంలోని తెనుగువాడలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని గంగిశెట్టి జగదీశ్వర్ నోట్‌బుక్స్, పెన్నులను అందజేశారు.

-హుజూరాబాద్ కేసీ క్యాంపులోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఫిబ్రవరి 9నుంచి 13వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు మంగళవారం తెలిపారు. 9వ తేదీన బ్రహ్మోత్సవ ఆరంభం, తీర్థ ప్రసాద గోష్టి, 13న పూర్ణాహుతి, పుష్పయాగం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

●గన్నేరువరం: మండలంలోని వివిధ గ్రామాలలో మెడికల్ షాపు నిర్వాహకులు ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్నారని సీపిఐ మండల కార్యదర్శి కాంతాల అంజిరెడ్డి ఆరోపించారు. మంగళవారం మండలంలోని గునుకుల కొండాపూర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు నకిలీ మందులను వాడి ప్రజలు అనారోగ్య బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్ కంట్రోల్ అధికారులు మెడికల్ షాపులలో తనిఖీలను చేపట్టాలని డిమాండ్ చేశారు.

●వీణవంక: మండలంలోని కిష్టంపేట, ఘన్ముక్ల, మల్లన్నపల్లి గ్రామాల్లో పొలాలను డివిజన్ వ్యవసాయ అధికారి సునీత పరిశీలించారు.

●వీణవంక: మండలంలోని మామిడాలపల్లికి చెందిన ఓ యువతితో పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన గాండ్ల శ్రావణ్‌కుమార్‌కు రెండు సంవత్సరాల క్రితం వివాహం నిశ్చయం అయింది. ఫిబ్రవరి 11 తేదిన పెళ్లి నిర్ణయించుకోగా తనను పెళ్లి చేసుకోనని వేరే అమ్మాయిని చేసుకుంటానని శ్రావణ్‌కుమార్ తెలిపాడని యువతి పోలీసుకలు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్టు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు.

-వీణవంక మండల కేంద్రానికి చెందిన గెల్లు అశోక్ అనారోగ్యంతో మృతి చెందగా యూఫ్ టీవి అధినేత పాడి ఉదయనందన్‌రెడ్డి ఐదు వేల రూపాయలను అందించారు.

●ఇల్లందకుంట: మండలంలోని రాచపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యులను గ్రామస్థులు సన్మానించారు. మాజీ సర్పంచ్ రాజకుమార్ పాల్గొన్నారు.